# వెలుగులోకి వచ్చిన తెలంగాణ వేమయ్య
# రావికంటి రామయ్య

తెలంగాణ వస్తే ఏమొస్తుందని ప్రశ్నించిన వారికి ఇప్పుడు సమాధానాలు కనిపిస్తున్నాయి. నిధులు, నీళ్లు, ఉద్యోగాల్లో ఇప్పటికే స్పష్టమైన పురోగతి తెలుస్తుండగా మన భాష, సంస్కృతి తలెత్తుకుని నిలుస్తున్నాయి. మన బతుకమ్మ విశ్వవ్యాప్తమైంది. మన బోనాలు మరింత తళుకులీనుతున్నాయి. వెక్కిరింతకు గురయిన మన యాస, భాష సముచిత గౌరవాన్ని పొందుతున్నాయి. టీవీల్లో, సినిమాల్లో తెలంగాణ భాష విజయసూత్రంగా మారింది. మరుగున పడిన సాహితీమూర్తులు, కవులు, కళాకారులు సగర్వంగా ప్రస్థానాన్ని సాగిస్తున్నారు. అంతకుముందు అసలు ఆలోచనకే అందని స్థాయిలో రచనలు ప్రాచుర్యం పొందుతున్నాయి. ఏకంగా పాఠ్య పుస్తకాలలో మన వారి రచనలు చోటు చేసుకున్నాయి. మరుగున పడిన మహోన్నత వ్యక్తిత్వాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ క్రమాన్ని మరింత వేగంగా ముందుకు తీసుకుపోయే క్రమంలో తెలంగాణ ప్రభుత్వం అత్యంత వేగంగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగానే ప్రతిష్ఠాత్మకంగా ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహిస్తోంది. ఈ సభల ద్వారా మారుమూల పల్లెల నుంచీ సాహితీ గంధం ప్రపంచమంతా వ్యాపిస్తోంది.

ఇన్నాళ్లూ ఆదరణకు నోచుకోని, మరుగున పడిన కవుల్లో కొంతమంది తెలంగాణ ప్రభుత్వం ప్రచురించిన పాఠ్యపుస్తకాల ద్వారా వెలుగులోకి వచ్చారు. పూర్వ కరీంనగర్ జిల్లా మంథనికి చెందిన కీ.శే. రావికంటి రామయ్య గుప్త వారిలో ఒకరు. ఏడో తరగతి తెలుగు పాఠ్య పుస్తకంలో వారి 'నగ్నసత్యాలు' శతకంలోని ఒక పద్యం చోటు చేసుకుంది. 'శతక సాహిత్యం' పేరిట ముద్రించిన పాఠంలో ప్రాచీన కవులు సుమతీ శతక కర్త బద్దెన, దాశరథీ శతకకర్త కంచెర్ల గోపన్న, నరసింహ శతకకర్త కాకుత్థం శేషప్ప కవి, వేమన శతక కర్త వేమనల సరసన ఆధునిక కవుల్లో పూర్వ కరీంనగర్ జిల్లా మంథనికి చెందిన కీ.శే. రావికంటి రామయ్య గుప్తకు చోటు కల్పించారు. పూర్వ వరంగల్ జిల్లాను చెందిన శ్రీ శ్రీనివాస బొమ్మల శతక కర్త డా॥ ఆడెపు చంద్రమౌళి, శ్రీ యాదగిరి లక్ష్మీనరసింహ శతకకర్త శ్రీ ధూపాటి సంపత్కుమారాచార్యలకు సైతం ఈ పాఠ్యాంశంలో చోటు దక్కింది. అంతకుముందు నన్నయ, తిక్కన, ఎర్రాప్రగడ లాంటి వారికి పరిమితమైన పాఠ్యగ్రంథాల్లో మన తెలంగాణకు చెందిన వారికి చోటు దక్కడం నిజంగా గర్వకారణం. మిగతా తరగతుల పాఠ్యపుస్తకాల్లోనూ ఇంకా ఎంతోమంది రచనలు చోటు చేసుకున్నాయి. మన ప్రాంతాలు, సంస్కృతి, పండగలపై కూడా పాఠ్యాంశాలు వచ్చాయి. పూర్వ కరీంనగర్ జిల్లా మంథనికి చెందిన విద్యావేత్త, చదువుల తల్లి ముద్దుబిడ్డ కీ.శే. ముద్దు రామకృష్ణయ్య ప్రథమ విదేశీ యాత్రకు సంబంధించి 'సముద్ర ప్రయాణం' పాఠ్యాంశంలో భాగమయింది. 4వ తరగతిలో 'నేను గోదావరిని' అనే పాఠంలో మంథనితో పాటు గోదావరి తీర ప్రాంతంలోని పుణ్యక్షేత్రాల గురించి ముద్రించారు. ఇవి కేవలం కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఇదంతా తెలంగాణ రావడం వల్లే సాధ్యమైంది. ఇలా వెలుగులోకి వచ్చిన వారిలో ఒకరైన తెలంగాణ వేమయ్యగా పేరొందిన రావికంటి రామయ్య గుప్తా గురించి ఈ వ్యాసంలో కొంత వివరంగా తెలుసుకుందాం.

## సహజ కవి శ్రీ రావికంటి రామయ్య గుప్త

పూర్వ కరీంగనర్ జిల్లా మంత్రకూటం (మంథని)కి చెందిన శ్రీ రావికంటి రామయ్యగుప్త సహజకవి. సరళమైన పదాలతో పామరులకు సైతం అర్థమయ్యే భాషలో ఆశువుగా కవిత్వం చెప్పడం ఆయన ప్రత్యేకత. నలభై ఏళ్ల పాటు ఉపాధ్యాయునిగా సేవలు అందించిన ఆయన వృత్తిలోనూ, ప్రవృత్తిలోనూ కవిత్వం కలగలసి పోయింది. తన మనసులో కలిగిన భావాలకు అలవోకగా అప్పటికప్పుడు అక్షర రూపమిచ్చి రంజింప చేయడంలో ఆయనకు ఆయనే సాటి. నీతి, నిజాయితీ, నిర్భీతి, నిర్మొహమాటం ఆయన పద్యాల్లో, గేయాల్లో గోచరిస్తాయి. మాటలాడినంత తేలికగా, సహజంగా ఆటవెలది పద్యాలను చెప్పడం వల్లనేమో ఆయనను 'మంత్రకూట వేమన' అంటారు. వేమన పద్యాల్లోని తీయదనం, సూటిదనం రావికంటి పద్యాల్లో గమనించవచ్చు. 'కల్లగాదు రావికంటి మాట' అన్న పద్యపాదం మంత్రపురి ప్రాంతంలో 'విశ్వదాభిరామ వినురవేమ' అన్న రీతిలో ప్రతిధ్వనిస్తూ ఉంటుంది. ఈ పాదంతో 'నగ్నసత్యాలు' పేరుతో శతకాన్ని వెలువరించారు. పేరుకు తగ్గట్లే ఇందులో అన్నీ చేదు నిజాలు, కఠిన వాస్తవాలు. ఆయన చురకలు అంటని రంగం లేదు అంటే అతిశయోక్తి కాదు.

శ్రీ రావికంటి రామయ్యను 'మంత్రకూట వేమన' అనే కాకుండా ఆర్.ఎం.పి. (రెడీమేడ్ పోయెట్) అని కూడా అంటారు. సందర్భమేదయినా, సదస్సు, సమావేశం ఏదయినా అక్కడ రావికంటి కవితాగానం ఉండి తీరాల్సిందే. కవి సమ్మేళనాల్లోనయితే ఆయనే ప్రత్యేక ఆకర్షణ. అప్పటికప్పుడు ఆశు కవిత్వం వినిపించడమే ఆయనకు ఆర్.ఎం.పి. అన్న పేరు తెచ్చింది.

'కవిరత్న'గా ఖ్యాతికెక్కిన రావికంటి జీవిత చరమాంకం వరకు కూడా కవితా వ్యాసంగం చేస్తూనే ఉన్నారు. కులదైవం వాసవీమాత జీవిత చరిత్రను గేయరూపంలో 'వాసవీగీత'గా వెలువరించారు. ఇది రాష్ట్రవ్యాప్తంగా అన్ని కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో మార్మోగుతోంది. శ్రీ రావికంటి రామయ్యను ఆర్యవైశ్య సంఘ ఆస్థానకవిగా గుర్తించారు. అలాగే ఉపాధ్యాయసంఘ ఆర్జిన కవిగా గౌరవించారు.

మంత్రపురంలో వెలసిన శ్రీ గౌతమేశ్వరుని కీర్తిస్తూ, స్తుతిస్తూ గౌతమేశ్వర శతకం, ఇందిరా గాంధీ జీవిత చరిత్రను వర్ణిస్తూ ఇందిరా విజయగీతి, అలాగే కన్యకాపరమేశ్వరి శతకాలను రచించారు. అలాగే మంథని ముద్దుబిడ్డ శ్రీ వరహాల భీమన్న గారి జీవిత చరిత్రను 'బుఱ్ఱకథ' గా మలిచారు. 'వరద గోదావరి' ఉయ్యాలపాటను ప్రచురించారు. భగవద్గీత సారాంశాన్ని తేలికగా అర్థమయ్యేలా 'గీతామృతము' పేరుతో గేయాలుగా రచించి పుస్తకం వెలువరించారు.

"భగవద్గీత సంస్కృతంలో ఉంది. దాని సందేశాన్ని సామాన్యుల వరకు తీసుకొని వెళ్ళవలసిన పనిని రావికంటి రామయ్య చాలా గొప్పగా చేశారని చెప్పవచ్చు"నని ప్రఖ్యాత కవి, రచయిత శ్రీ గజానన్ థామన్ గారు 'గీతామృతము' తొలిపలుకులో పేర్కొన్నారు.

పద్యాలు, శతకాలతో పాటు శ్రీ రావికంటి రామయ్య అనేక స్థానిక, సామాజిక సమస్యలపై ఎప్పటికప్పుడు గేయాలు వెలువరించే వారు. వీటిలో నల్లాల భాగోతం, రామగుండం – రాత్రిగండం చాలా ప్రసిద్ధి చెందాయి. అవినీతి, లంచగొండితనం, బంధుప్రీతి, వరకట్న దురాచారం, రాజకీయాల్లో ఏకపక్ష ధోరణులు... ఇలా ఎన్నింటిపైనో ఆయన అక్షర శరాలు సంధించారు. 'కవి నిరంకుశుడు' అన్నట్లు ఆయన ఎవరినీ వదిలిపెట్టలేదు. తాను అనుకున్నది అనుకున్నట్లు మక్కుసూటిగా, బల్లగుద్దినట్లు చెప్పడం ఆయన నైజం. ఆయన అచ్చంగా ప్రజాకవి. ప్రజలవైపు నుంచి ప్రశ్నించడం, నిలదీయడం ఆయన సహజ లక్షణం.

మంత్రపురి అంటే అంతులేని అభిమానం. 'మనవారు' అంటే ఎల్లలెరుగని ప్రేమ, సహచరులంటే ప్రాణం. శిష్యులు కనిపిస్తే పండగ, పలకరిస్తే పరవశం. కల్లాకపటం ఎరుగని నిష్కల్మష మనస్తత్వం, స్నేహపూరిత ధోరణి ఆయన వ్యక్తిత్వానికి వన్నెలద్దాయి.

పండగయినా, పబ్బమైనా, బంధువుల ఇళ్లల్లో ఏ వేడుకయినా రావికంటి గేయమే అక్కడ ప్రధాన ఆకర్షణ. ఎంతోమందికి ఆయన అక్షరాశీస్సులు అందాయి. వివాహవేళ ఆయన అందించే అక్షరాభినందనలను ఎన్నో జంటలు ప్రాణప్రదంగా దాచుకున్నాయి. ఆయన అభినందనలు అందుకున్న ప్రతి నాయకుడు ఆయనపై అపారమైన గౌరవ ప్రపత్తులు చాటుతుంటారు.

పూర్వ కరీంనగర్ జిల్లా ఆవోపా (ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్), ఆర్యవైశ్య సంఘం (మంథని), కరీంనగర్ జిల్లా అన్నమయ్య అకాడమీ, జగిత్యాల జేశెట్టి రమణయ్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌తో పాటు ఎన్నో సంస్థలు శ్రీ రావికంటి రామయ్య గుప్తను ఘనంగా సత్కరించాయి. మాజీ ముఖ్యమంత్రి, నాటి ఆరోగ్య మంత్రి శ్రీ కొణిజేటి రోశయ్య గారి చేతుల మీదుగా సన్మానాన్ని పొందారు. అమెరికాలోనూ ఆయన కవితాగానం చేశారు. శ్రీ మాడుగుల నాగఫణి శర్మ నిర్వహించిన అష్టావధానంలో పృచ్ఛకునిగా పాల్గొన్నారు.

మంథని విశిష్టత, ప్రత్యేకతలకు సంబంధించి పత్రికల్లో ఎప్పుడు వ్యాసాలు వచ్చినా శ్రీ రావికంటి రామయ్య ప్రస్తావన లేకుండా ఉండదు. మంథని ముద్దుబిడ్డగా ఆయన స్థానం ఎప్పటికీ పదిలంగా ఉంటుంది. 'కల్లగాదు రావికంటి మాట' పాదం ప్రతిధ్వనిస్తూ ఉంటుంది.

**"ఒక్క రాజమండ్రికేన పుష్కరాలు, తక్కిన క్షేత్రాలన్నీ నిష్ఫలాలా?**
**ధర్మపురి, మంథెన్న, కాళేశ్వరము, పంచవటి, పర్ణశాల, భద్రాచలము ఎన్నో క్షేత్రాలున్నవి ఏమి లాభము?**
**ఆదుకునే వాడేడి? అడిగే వాడేడి?"**
అని సమైక్య రాష్ట్రంలో వివక్షను ధిక్కార స్వరంతో ప్రశ్నించిన కవి శ్రీ రావికంటి రామయ్య గుప్త.

అది శతకమైనా, గేయమైనా, బుర్రకథ అయినా, ఉయ్యాల పాటయినా, భజన కీర్తన అయినా అన్నింటా ప్రతిబింబిచేవి సామాజిక సమస్యలే. పరిష్కరించలేని నాయకులు, అధికారుల నిలదీతలే. అక్షరమక్షరంలో ప్రజాపక్షం వహించిన ఆయన వివిధ అంశాలపై, వివిధ సందర్భాల్లో రాసిన కొన్ని పద్యాలు....

**లంచాలు - పైరవీలపై**

చిట్టియున్న పనులు చిత్రము నెరవేరు
చేయ తడుప పనులు జల్ది యగును
రుద్రభూమి కైన రుక్కయె కావాలి
కల్లకాదు రావికంటి మాట.

**కులమతాలపై**

హిందు క్రైస్తవీయ, ఇస్లాము మతములు
గతులు వేరుగాని గమ్యమొకటె
వేరువేరు నదులు చేరవా సంద్రమ్ము
కల్లగాదు రావికంటి మాట.

**వరకట్న దురాచారాలపై**

కాళ్లు కడిగి నాడు కన్యనిచ్చారంట
ఇల్లుకడిగి నేడు యివ్వవలెను
అల్లునలక తీర్చ యజుకైన తరమౌన
కల్లకాదు రావికంటి మాట.

**అర్చక వ్యవస్థ తీరుపై**

ముడుపు లేక మొక్కుబళ్లెవ్వియూ
శ్రీనివాసుడసలె చేతగొనడు
దైవమైన నేడు డబ్బుకు దాసుడే
కల్లగాదు రావికంటి మాట.

**దుర్వ్యసనాలపై**

కమ్మలాట లాడు క్లబ్బు లెక్కువ పెర్గె
రమ్మియాట రాని తమ్ములేరి?
యిల్లుగుల్ల చేయు యిస్పేటు ఆటరా
కల్లగాదు రావికంటి మాట.

**కల్తీలపై**

కల్తిలేని సరుకు కానరాదెక్కడ
అంతా కల్తిమయమె యసలు సున్న
కల్తి రహిత జగము కాన్పించుటెన్నడో
కల్లగాదు రావికంటి మాట.

**బాలలపై (వాసవి కన్యకాపరమేశ్వరి శతకం)**

పలకబలపంబు పట్టుక బాలురంత
బడికి వెళ్లేటి వయసులో బండలెత్తి
బండ చాకిరి చేయుట బాధకరమే
కరుణ జూపించు మంథెన్న కన్యకాంబ

భయము భక్తియు లేకుండ బాలురంత
పెరుగుచున్నారు ఈనాడు విరివిగాను
మాతపితరులు తమ విధి మరచినారా?
కరుణ జూపించు మంథెన్న కన్యకాంబ

**తెలుగు**

వీధివీధిన కాన్వెంట్లు విస్తరించె
మనదు సంస్కృతి యేనాడొ మంటగలిసె
మమ్మి, డాడిల చదువులే మనకుయుండె
కరుణ జూపించు మంథెన్న కన్యకాంబ.

తల్లి భాషను మరచిన పిల్లలంత
ఎన్ని భాషలు నేర్చిన ఏమి ఫలము?
గాలిలోపల మేడలు కట్టినట్లు?
కరుణ జూపించు మంథెన్న కన్యకాంబ.

**<u>వైభవంగా నగ్నసత్యాలు, శ్రీ గౌతమేశ్వర శతకాలు, సీడీల ఆవిష్కరణ</u>**

తెలంగాణ ప్రభుత్వం అత్యంత వైభంగా ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహిస్తున్న సందర్భంలో కీ.శే. రావికంటి రామయ్య గుప్త గారి పేరు రాష్ట్రమంతా తెలిసేలా నగ్నసత్యాలు, శ్రీ గౌతమేశ్వర శతకం పుస్తకాలు, ఆడియో సీడీల ఆవిష్కరణ కార్యక్రమం డిసెంబరు ఆరోతేదీన రవీంద్రభారతిలో అత్యంత వైభవంగా జరిగింది. రాష్ట్ర శాసనమండలి ఛైర్మన్ శ్రీ స్వామిగౌడ్ గారు, ప్రపంచ తెలుగు మహాసభల రథసారథులు, తెలంగాణ సాహిత్య అకాడమీ ఛైర్మన్ నందిని సిధారెడ్డి గారు, ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీ అల్లం నారాయణ గారు, ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేక అధికారి శ్రీ దేశపతి శ్రీనివాస్ గారు, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు శ్రీ మామిడి హరికృష్ణ గారు, తెలుగు అమలు కమిటీ సభ్యుడు శ్రీ సువర్ణ వినాయక్ తదితరులంతా హాజరయ్యారు.

నగ్నసత్యాల సీడీలు ప్రపంచ తెలుగు మహాసభల ప్రాంగణాల్లో ప్రతిధ్వనించాలని శ్రీ స్వామిగౌడ్ గారు ఆకాంక్షించడం అమితానందం కలిగించింది. ఆ మేరకు ప్రభుత్వానికి లేఖ కూడా రాస్తాననడం విశేషం. ప్రముఖ కవి, గాయకుడు, శ్రీ దేశపతి శ్రీనివాస్ గారు ఈ శతకాలను ఆడియో సీడీల రూపంలో తీసుకురావాలని ఇచ్చిన సూచన మేరకే ఈ సీడీలు రూపొందాయి. ప్రముఖ సినీ సంగీత దర్శకుడు శ్రీ శంభుప్రసాద్ గారి స్వర కల్పనలో ప్రముఖ గాయకులు శ్రీ జై శ్రీనివాస్, శ్రీమతి నిష్మ గారు

వాటిని ఆలపించారు. వీటిని సమావేశ ప్రాంగణంలో వినపించగా వాటిని ఆస్వాదించిన శ్రీ స్వామిగౌడ్ గారు అద్భుత ప్రతిపాదన చేశారు. ఇక దేశపతి గారు శతకంలోని కొన్ని పద్యాలను అద్భుతంగా ఆలపించి విశ్లేషించారు. శ్రీ అల్లం నారాయణ గారు రామయ్యగారితో, మంథనితో అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. రామయ్య సారు ఆదరించడం వల్లే తనకు భాషపై మక్కువ కలిగి ఈ స్థాయికి చేరుకున్నట్లు చెప్పారు. ఇక సిధారెడ్డి గారు క్షణం తీరికలేని స్థితిలోనూ సమయం కేటాయించి రామయ్య గారి కృషిని గుర్తు చేసుకోవడం ప్రశంసనీయమన్నారు. శ్రీ మామిడి హరికృష్ణ గారు ఈ సభ విజయవంతానికి ఎంతో దోహదపడ్డారు. రవీంద్రభారతిలోని పైడి జయరాజ్ ప్రివ్యూ థియేటర్‌ను కేటాయించడమే కాకుండా సభకు హాజరై తన సందేశాన్ని వినిపించారు.

ప్రభుత్వం శ్రీ రావికంటి రామయ్య గారినే కాకుండా ఇలాంటి మరుగున పడిన కవులను, సాహితీ వేత్తలను వెలికితీసి, వారి రచనలన్నీ ప్రచురణకు నోచుకునేలా, ప్రాచుర్యం పొందేలా కృషి చేయాలని, అప్పుడే తెలంగాణ స్వప్నం సాకారమవుతోందని పలువురు అభిప్రాయపడ్డారు.

**వ్యక్తిగత వివరాలు :**

| | | |
|---|---|---|
| పేరు | : | **రావికంటి రామయ్య గుప్త** |
| తండ్రి | : | రావికంటి రాజయ్య |
| తల్లి | : | రావికంటి సీతమ్మ |
| పుట్టినతేది | : | 17-06-1936 |
| విద్య | : | H.S.C., B.O.L., తెలుగు పండిట్ |
| మరణం | : | 30-03-2009 |
| భార్య | : | రావికంటి సరోజన |
| సంతానం | : | 1. రావికంటి శ్రీనివాస్<br>డిప్యూటీ న్యూస్ ఎడిటర్, ఈనాడు, హైదరాబాద్<br>2. రావికంటి శ్రీకాంత్,<br>సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, క్యాన్సస్, USA<br>3. తోట పద్మజ (టీచర్) వరంగల్<br>W/o. శంకర్‌రావు<br>4. గుండా శైలజ<br>W/o. హరీష్, మంథని |